కథ

**నా మనసులో ఇంకా 'ఆమె'ను ప్రేమిస్తున్నాను అనే స్టేట్‌మెంట్ లేదు కదా! ఓ వైపు 'అమ్మ' మాటలు వింటూనే నా పనిలో నేను కొట్టుమిట్టాడుతున్నాను.**

**మెదడూ, తనువు ఒక్కసారిగా మొద్దుబారిపోయాయి ఆ ప్రశ్నకు.**

# మనసు దోసిట పట్టి...

నిన్న రాత్రొచ్చిన కల గురించే ఆలోచిస్తున్నాను. వీపుమీద ఉయ్యాల ఊగుతూ మెడ చుట్టూ చేతులేసి ఉంది అమృత. నాలో చలనం లేకపోయేసరికి తను కూడా నాకలాగే అతుక్కుపోయింది.

''చెప్పవేంటి బాబూ...?'' అసహనంగా అడిగింది.

''మన మీద కోపంతో దూ...రం...గా వెళ్లడమే చనిపోవడమంటే...'' నమ్ముతోందా లేదానన్న అనుమానంతో వెనక్కి తిరిగా.

''ఓహో! మళ్లీ మనం పిలిస్తే వస్తారా మరి'' మరో వాక్బాణం. కాలికున్న ఉరి కాస్త మెడకి పడిందన్నట్లుగా నా పరిస్థితి.

నే చెప్పే సమాధానం రకరకాల ఆలోచనలను దాటుకుని రావడానికి కాస్త ఆలస్యమైందేమో నన్ను విడిపించుకుని వెళ్లబోతుంటే ఆపాను.

''ఎక్కడికమ్మా?''

''తాతయ్యని పిలవమని అమ్మకి చెప్పడానికి...''

అవాక్కయ్యాను.

''అమ్మని ఇప్పుడేమీ అడగకు. పాపం! వాళ్ల నాన్న అలిగి దూరంగా వెళ్లాడు కదా! రేపు తెలుసుకుందాంలే. నువ్విప్పుడు నిద్రపో'' అంటూ బుజ్జగించాను.

నా ఒడిలో తల పెట్టుకుని పడుకుంది.

చందమామ లాంటి ముఖం, వంకీల జుత్తు, పాలమీగడ చెక్కిళ్లు, చేపపిల్లల్లా కదిలే కనుపాపలు...అచ్చు వాళ్లమ్మ పోలికే.

నవ్వొచ్చింది. తన రాకకు నేను కారణం కానప్పుడు నా పోలికలెలా ఉంటాయి? అయినా అమృతలో మా అమ్మను చూసుకోవడం నాకలవాటైంది. ఇంకా చెప్పాలంటే బలహీనతైంది.

అందుకే నన్ను ''బాబూ!'' అని పిలిచేలా నేర్పాను.

అంజలికి తాళి కట్టలేదు. తన చేయి పట్టలేదు కానీ భర్తనయ్యాను. అమృతకు రక్తం పంచలేదు అయినా తండ్రినయ్యాను.

మా రెండు జీవితాలు రెండు వేర్వేరు తీరాలు. ఆ తీరాలకు వారధిగా ఓ చిన్ని దేవత. నేను 'అమ్మా' అని పిలుచుకునే అమృత.

ఆ 'కల' రావడంతో నా మనసును అనుమానించాను. ఎప్పటిలాగే అవమానిస్తున్నాను. కానీ తెల్లారితే అదే నిజమై ఎదురొస్తుందని నాకు తెలీదు.

★ ★ ★

అప్పటికీ నన్నందరూ 'అనాథ'లా చూస్తుంటే...అమ్మొందిలే అనుకునే వాడిని. కానీ అప్పుడు నిజంగానే అనాథనిపించింది అమ్మ దూరమయ్యేసరికి.

అంజలిని ఇవ్వకపోతే మానే నన్ను పట్టుకుని ఎంతెంత మాటలంది అత్తమ్మ? ''కూటికి కూడా గతిలేనోడికి నా కూతురు కావాల్సి వచ్చిందా? చిల్లర పనులు చేసుకు బతికేవాడికి నా కూతుర్నివ్వాలా?'' అని.

ఈ మాటలే అమ్మనూ, నన్ను గాయపరిచాయి.

ఇంతకంటే పెద్ద గాయం అంజలి నన్ను కాదనడం. ఇది తట్టుకోలేకే అమ్మ దిగులుతో కన్నుమూసింది. అంజలి నుండి వ్యతిరేకత వస్తుందని నాకు ముందే తెలుసు. అయినా అమ్మకెలా చెప్పడం? చెప్పినా అమ్మ కూడా నొచ్చుకుంటుందని నోరు మెదపలేదు.

చదువు పూర్తి చేసుకుని పట్నానే కాకుండా కడుపులో పెరుగుతున్న అమృతను కూడా వెంట తెచ్చుకుంది అంజలి.

ప్రేమ పేరుతో తల్లి కాబోతున్న అంజలి దీనికి కారణమైన వాడి ముఖమ్మీద ఉమ్మేసి మరీ వచ్చింది. కారణం ఆయన పెళ్లికి తటపటాయించి అబార్షన్ చేయిస్తానని కాళ్లు పట్టుకోవడంతో. తనకి ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం రెండూ ఎక్కువే. అందుకే లోకజ్ఞానం లేనిదానివలె తల్లి కాబోతూ వచ్చింది.

గుప్పుమందీ వార్త. మామయ్య తల పట్టుకున్నాడు. అత్తమ్మ తల తీసేసినట్లు భావించి అంజలిని అంతకు ముందెన్నడూ అనని మాటలంది.

ఒకటే ఊళ్లో ఉంటూ కనీసం పలకరింపుకైనా రాలేదంటారని వెళ్లమన్నారు కొందరు. నాకందుకు కాకుండా ఆయనెవరో కనుక్కుని ఎలాగైనా ఒప్పించి పెళ్లి చేయ్యాలన్న ఉద్దేశ్యం కలిగి వెళ్లాలనిపించింది.

నేనూహించిన విధంగా జరగలేదక్కడ.

''ఎలాగూ చెడిపోయింది. ఇక దీని ముఖమెవ్వడూ చూడడు. నా కాళ్ల మీద పడి వేడుకుంటుందని వచ్చావా?'' అంది అంజలి.

చెంప మీద ఆ రోజు చాచి కొట్టినట్లే అదిరిపడ్డాను.

నోట మాట రాక, చూపు నిలపలేక, తనువు మొత్తం ఆవిరైనట్లు శూన్యంగా మారాను. 'ఎంత మాటంది అంజలి?' మనసు విలవిల్లాడుతోంది.

మామయ్య వైపోసారి చూసి వెనుదిరిగి వచ్చేశా.

ప్రాణప్రదంగా ప్రేమిస్తూ వస్తున్న అంజలి మనసులో నా స్థానం 'ఏ స్థానం'లో ఉందో తెలిసింది కదా!

''మాటలతో గాయాలు చేయకు. మానడానికి మరో జన్మ కూడా సరిపోదు'' అని చెప్పే నేను చేతలతో గాయం చేశా కదా!

ఏడేళ్ల క్రితం చెరపలేని మచ్చలా... మానిపోని గాయంలా నేనో పని చేశా.

అంజలికి ఆ సంవత్సరమే చీర కట్టించారు.

కాస్త జులాయిగా తిరిగే నేను నాలాంటి మిత్ర బృందం అంజలిని చీరలో చూశాం. తెల్లారితే 'బతుకమ్మ పండుగ'.

''కాబోయే పెళ్లాన్ని ముద్దు పెట్టుకోవడం తప్పు కాదు. ఆమాత్రం ధైర్యం లేకపోతే ఎలా?'' అంటూ రెచ్చగొట్టారు.

కొత్త అందాలు. అంతవరకు చూడనివి, లేనివి, ఆ నాజూకుతనం ఆ వయ్యారం ఆ నునుసిగ్గుల బుగ్గలు... కళ్ల ముందు మెదిలేసరికి 'సై' అన్నాను.

ఇంటికెళుతున్న సమయం- చీకటి.

మాటువేసి ఉన్నాను. తన తోటి అమ్మాయిలతో గుంపుగా వస్తుండగా చటుక్కున చేయి పట్టి పక్కకు లాగాను.

ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని తమకంతో బుగ్గల మీద ముద్దు పెట్టుకున్నాను.

'చెళ్' మనే చప్పుడు. చెంప ఎర్రబారింది.

మత్తు దిగిపోయినంత పనైంది నాకు.

ఆ చీకటి వెలుతురులో తన వెన్నెల గనుల కన్నుల్లో కన్నీటి ఊట స్పష్టంగా కనబడింది.

దోషిలా తలవంచుకు నిలబడ్డాను.

''నన్ను మరోసారి తాకితే నేను చచ్చిపోయినట్లే'' ఎక్కిళ్లను దాటి వస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ అంది.

నిజమే! అంజలి అప్పుడు చాలా సున్నితంగా కన

బడేది.

వెనుదిరిగిపోతుంటే క్షమించమని అడగబోయా.

గొంతు మాటలను మింగేసి మౌనంగా అరిచింది. తనకి వినబడితేనా!? అప్పుడే విరిసిన కుసుమాన్ని ఎంతలా గాయపరిచాను?!

దానికి తోడు నా అచ్చిరాని చదువు, మొరటుతనం ఇవన్నీ అంజలి గుండెలో నా గూర్చి చులకన భావాన్ని నింపుతూ వచ్చాయ్!

★ ★ ★

మొదటసలు నమ్మలేదు. అంజలి అలాంటి పిరికి పని చేయదు కదాని! ఏ బలహీన క్షణం తన్ను ఆత్మహత్యా యత్నానికి పురమాయించుతుంది!

ఆ ఇంటి వైపు రావద్దని ముఖం మీదే చెప్పినా అంజలిని చూడాలని మనసు ఆరాటపడింది.

వెళితే మళ్లింకేం మాటలంటుందోనని కాలు కదలలేదు.

దేవుడు నా మొర ఆలకించినట్లు...ఓ రోజు గుడికి వెళ్తొస్తూ ఎదురైంది. నిజంగా మనసులోనే అభినందించాను.

పెళ్లి కాకుండానే తల్లయినా కూడా ఇంకా సమాజంలో ఒక్కత్తిగా మసలుతోందంటే..గొప్పే మరి! చేసింది తప్పయినా దాన్నొప్పుకుని భరించే వాళ్లే నిజంగా ధీరులు.

తెలుసు నాకు- నన్ను చూడదని, చూసినా ఆగదని, ఆగినా తన గొంతు మోగదని. నా మనసు దాహంతో ఉన్నవాడికి నీటి చెలమ కనబడినట్లు ఉక్కిరి బిక్కిరైపోతోంది.

గొంతులో ఎన్నాళ్ల నుండి గడ్డకట్టుకున్నాయో మాటలు. అందులో ఒక మాట కరిగి గాల్లోకి వచ్చింది.

''అంజలి''

ఆగింది తను నా వైపు తల తిప్పకుండానే!

''చనిపోయే ముందు నాకో మాట చెప్పు. రావడానికి నేనూ సిద్ధమే!'' అనేసి నే వెళ్లిపోయా.

మాట్లాడవద్దనే కదా తను చెప్పింది! మరి మాట తప్పడం నాకూ ఇష్టం లేదు. కానీ మనసు తన ప్రాణంతో మాట్లాడుతానన్నప్పుడు గొంతు మాటల మూట విప్పదా? అది మూగదైనా!

ఓ రోజు సాయంత్రం నేను గ్యారేజ్‌లో పని చేసుకుంటుండగా మామయ్య ప్రత్యక్షమయ్యాడు.

నన్ను చూడగానే బావురుమన్నాడు.

''నా చిట్టితల్లిని చంపేసేలా ఉన్నార్రా! మెతుకు తిననీయకుండా, కునుకు తీయనీయకుండా మాటలతో చంపుతున్నారు. నువ్వే ఏదైనా చేయరా వేణూ''




అంటూ కాళ్ల మీద పడ్డంత పని చేశాడు.

నా మనసు చివుక్కుమంది. అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కూతురు. ఇప్పుడు అయినవాళ్లతోనే చివాట్లు పడుతోంది.

మామయ్యను దగ్గరికి తీసుకుని ఓదార్చాను ''పద'' అంటూ.

చెదిరిన జుత్తు. నూనె రాసిన దాఖలాలు లేవు చాన్నాళ్లుగ. ముఖం మీద కన్నీటి చారికలు తడితడిగా. రంగు మాసిన చీర...జీవం లేని చూపు...ఇదీ అంజలి పరి(దు)స్థితి.

దీన్ని బట్టి ఈమెను, ఈమె స్థైర్యాన్ని దారుణంగా ఎవరో దెబ్బతీశారు. ఏమై ఉంటుందా సంఘటనా...ఎవరై ఉంటారా వ్యక్తి?

ఇంకెవరు మా అత్తమ్మే!

ఇద్దరు పెళ్లాలు చాలక బయట వ్యభిచారం సాగించే దూరపుచుట్టపు అల్లుడికి అంజలి కావాల్సి వచ్చిందట. పెళ్లి కాదు కానీ 'అవసరానికి' అని. ఆస్తులకేం కొదవలేదు అప్పటికే పది లక్షలకని బేరం పెట్టాడు వాడు.

**సుగంధ శ్రీనివాస్**

పాపం అంజలి! నా రక్తం మరుగుతోంది.

ఇంట్లో వాళ్లందరూ చూస్తుండగానే అంజలి దగ్గరకి నేరుగా వెళ్లాను.

తలెత్తి చూసింది విస్మయంగా.

చేయి పట్టుకుని పైకి లేపి బరబరా వాళ్ల ముందుకు లాక్కొచ్చాను.

అప్పటికే చుట్టుపక్కల వాళ్లు కొంత మంది గుమిగూడారు.

''అంజలి తప్పే చేసింది కావచ్చు. అందుకోసమని ఇలా రాక్షసుల్లా ప్రవర్తిస్తారా? తనను మనిషనుకుంటున్నారా బానిసనుకుంటున్నారా? లోకంలో ఇంత కంటే పెద్ద పొరపాట్లు చేసినవాళ్లు, సరిదిద్దుకోలేని తప్పులు చేసినవాళ్లు లేరా? వారి ముందు అంజలి చేసిన తప్పు ఏపాటి!? అంతరాత్మను మభ్యపెట్టలేకనే కదా ఇలా కాబోతున్న తల్లిలా, దోషిలా మనముందు నిలబడింది. అప్పుడే అబార్షన్‌కి ఒప్పుకుంటే మీకీ విషయం తెలుసుండేదా?'' ఆగాను.

''అంత పరువు తక్కువ పని చేసిందని మీకనిపిస్తే ఈ క్షణం నుండి నాతోనే ఉంటుంది. మీ అనుమతి కాదు దీనికి కావాల్సింది...'' అంటూ

అంజలి వైపు తిరిగాను.

''ఈ రోజు నుండి నేను నీ సంరక్షకుడిని. అంతకు మించి మరేమి కాను. కాబోను. నా మాట మీద నమ్మకముంచి నాతో రా!''

ఏదో అనబోయింది.

''నిన్ను కలలో కూడా తాకను. నీ మీద నేనె లాంటి అధికారం చూపించను. నిన్ను తాకితే నేను మరణించినట్లే'' ఆవేశంగా అంటూ బయటికి ధారి తీశాను.

అంతా ఆశ్చర్యంగా చూస్తున్నారు. అంజలికి మొదటేం చేయాలో తోచనట్టుంది. సరిగ్గా నిమిషం గడిచాక మెల్లగా గడపదాటింది కట్టు బట్టల్తో!

★ ★ ★

పాప జన్మించింది. నాకైతే అమ్మే తిరిగి వచ్చినంత ఆనందం!

ఇక మా ఇద్దరి మధ్య మాటలుండవ్! ఎవరి లోకంలో వాళ్లం. ఎవరికి ఎవరం ఏమీ కాము. ఒకరికొకరం కనబడం, విన బడం. అలాంటి మా ఇద్దరి మధ్య పాప 'అమృతం' కురిపించింది. అందుకనే అమ్మ పేరుతో 'అమృతా' అని పిలుస్తా.

ఊరినొదిలేసి కరీంనగర్ రావడం మంచి దైంది. ఆ పాత జ్ఞాపకాలు, మనుషులు అన్నీ దూరంగా తోసేసినట్లుగా ఇక్కడ పరిసరాలు. అందుకే ఏడేళ్లు ఎలా గడిచాయో నాకే అర్థం కావడం లేదు.

ఇన్ని రోజులలో ఏ ఒక్క రోజు మా హృదయా లను 'తడి' చేయలేదు. శిలలాంటి హృదయాలని ఏ చినుకూ తడపదని మాకూ తెలుసు.

అమృత ప్రశ్నలకి తాళలేక నేనే చెప్పాను.

''అమ్మ నాతో మాట్లాడినా నేను అమ్మతో మాట్లాడినా దేవుడికి కోపం వస్తుంద''ని.

''ఆయనెవరు?'' అంటుంది అమాయకంగా.

మళ్లీ నా వెదుకులాట మాటల కోసం.

అమృతకు మా ఇద్దరి ప్రవర్తన వింతలా అనిపించేది కావచ్చు.

''నువ్వు నన్నెందుకు 'అమ్మా' అని పిలుస్తావ్?'' అడిగిందోసారి.

''మా అమ్మ నీలాగే ఉండేది. పేరు కూడా అమృతే!'' అన్నాను.

కొన్ని క్షణాలాగి ఏమాలోచించిందో గానీ ''మరీ! నీకన్నం తినిపించనా బాబూ'' అంది. నా అనుమతి ఎందుకడిగినట్లు?

అంజలి ముందే ఇదంతా జరుగుతోంది.

కన్నీళ్లాగలేదు నాకసలు. వాటినాపుకో లేకపోతున్న క్షణంలో అంజలి ఏదో పనున్నట్లు అక్కడ్నుంచి వెళ్లిపోయింది. కావాలనే అలా చేసింది.

అమృతను గుండెలకు హత్తుకుని ఏడ్చాను. చాలా రోజుల తర్వాత మనస్ఫూర్తిగా ఏడ్చాను. ఒంటరిగా బ్రతుకుతున్న నా జీవితంలో పన్నీరు జల్లిన ఆ చిన్నారికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పానో నాకే తెలీదు.

నా గురించి తెలిసిన చాలా మంది అంటారు. ''మంచి జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకున్నావ్! వద్దని తిరస్కరించాక్కూడా దాన్నే ఇంట్లో తెచ్చి పెట్టుకుని ఏ సుఖమూ లేకుండా ఎందుకురా నీ బ్రతుకు'' అని.

నవ్వుతాను. అదే కదా విమర్శకూ, ఓటమికి సమాధానం!

నాలాంటి వాడికి 'జీవితమే ఓటమి' అని కొంత మంది అభిప్రాయం.

కానీ ఓటమి కూడా జీవితమే! బ్రతకడమే గొప్ప గెలుపని నమ్ముతున్నవాడ్ని. మిగతా సుఖాలన్నీ పైపై మెరుగులని నా అభిప్రాయం.

మామయ్య పోయాడన్న వార్తతో ఊళ్లోకడుగు పెట్టాం.


సర్కస్ బోనులో జంతువులను పిల్లలెంత ఉత్సుకతతో చూస్తారో అమృతనూ, అంజలిని అంతే ఉత్సుకతతో చూస్తున్నారు ఊరి జనం.

గుండెలవిసిపోయేలా ఏడ్చింది అంజలి. ఏళ్లకేళ్లుగా దాచుకున్న కన్నీళ్లన్నీ కుండపోతగా కుమ్మరించింది మామయ్య మృతదేహంపై.

అమృత నా దగ్గరే ఉంది ఇదంతా చూస్తూ.

అంతవరకూ ఒక్కరూ పలకరించని అంజలితో అంత్యక్రియలయ్యాక బయలుదేరడానికి బేగ్ సర్దుకుంటుండగా వాళ్లమ్మ అడిగింది.

''ఎక్కడికే పోవడం. ఆ తల మాసినవాడితోనా నీ బ్రతుకు. ఆ పిల్లను ఏ అనాథాశ్రమంలోనైనా చేర్పి



## అవునా? నిజమేనా?

**తారల మాటలు విచిత్రంగా ఉంటాయి. సినీతారలకి కొంతమంది క్లోజ్‌ఫ్రెండ్స్ ఉంటారు. హీరోయిన్స్ అయితే తమకిష్టమైన వారితో దోస్తీ చేస్తారు. అమీషా పటేల్ మాత్రం తనకి బాయ్‌ఫ్రెండ్స్ అవసరమే లేదంటోంది. 'చాలామందిలాగా నాకు బోలెడంతమంది బాయ్‌ఫ్రెండ్స్ లేరు. ఇంకా చెప్పాలంటే నాకసలు బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరగడం అంటేనే ఇష్టం ఉండదు' ఒక డైరెక్టర్‌తో చాలా క్లోజ్‌గా తిరుగుతోందంటూ రూమర్లు వస్తున్న తరుణంలో అమీషా ఇలా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమైంది.**

స్తాంగానీ లతక్కకు పిల్లలు కార తేలిందట. నిన్ను చేసుకోవడానికి అడ డానికొచ్చాడు బావ...ఉండిపో'' అంది లతక్క అంటే అంజలి పెద్దమ కూతురు.

చురుక్కున తలెత్తి చూసింది అంజలి. ఆ చూపులో అసహ్యం, అలక్ష్యం, అశ్రద్ధ. మౌనంగా తన పని తాను చేసుకుంటోంది.

సమాధానమేమీ రాకపోయేసరికి ''ఏం మాట్లాడి చావవేం'' అని గద్దించింది అత్తమ్మ.

అంతే తీవ్ర స్వరంతో ''నువ్వసలు మని

వేనా?'' అంది అంజలి.

ఎవరి పెంపకంలో అంజలి మా కుటుంబాన్ని అసహ్యించుకునేలా మారిందో ఆమెనే అంత మాటనేసరికి ఆశ్చర్యపోతూ సరైన ప్రశ్నడిగిందని పించింది.

నేను తప్ప విన్న మిగతావారందరూ నమ్మలేనట్లు అంజలిని చూస్తున్నారు.

నా భావన నిజం కాదనేలా నాకన్నా ముందే గడప దాటింది. ఉండిపోతుందేమోనన్న 'శంక' నా మనసులో ఉంది మరి.

ఆమె వెనకాలే అమృతనెత్తుకుని నడిచా కాస్త గర్వంగా.

★ ★ ★

సాయంత్రం ఇంటికొచ్చేసరికి పరుగెత్తుకుని ఎదురొచ్చే అమృత రాలేదు. ఏమైందీ రోజు మరి. ఆడుకుంటున్నదేమోనంటే అదీ కాదు.

మౌనంగా కూచొని ఉంది. కళ్లు మూశాను దాగుడుమూతల్లాగా.

''నీతో మాట్లాడను. నీ దోస్త్ కటీఫ్'' అంది సీరియస్‌గా.

నిన్న రాత్రే కదా గుండెల మీద పడుకుంది. వీపు మీద ఊయలూగుతూ సమాధానం చెప్పలేని ప్రశ్నలడిగింది!

మరి అలాంటిది ఎందుకలా అంటోందో అర్థం కాలేదు.

''నేనంటే నీకిష్టం లేదు...'' అంది తిరిగి తానే.

''నువ్వు నా ప్రాణానివి. ఎవరైనా ప్రాణాలను ఇష్టపడరా?''

''అంతా అబద్ధం'' అంది ముఖం తిప్పుకుని.

''అందులో అన్నీ అమ్మ ఫొటోలే ఉన్నాయి. ఒక్కటి కూడా లేదు నాది. నేనంటే నీకిష్టముంటే నా ఫొటో ఏది మరి?'' మాటలు బాగా నేర్చింది. ఈ కాలం పిల్లలే అంత!

''ఈ ఫొటోలేంటి?'' ఒక్క క్షణం అర్థం కాలేదు.

అర్థమయ్యాక పక్కన భూమి కంపించినంత భయపడ్డాను.

బొమ్మలు గీయడమనేది నాకు చిన్నప్పటి నుండీ ఉన్న అలవాటూ, ఇష్టం.

ఊహ తెలియక ముందు నుండే అంజలి చిత్రాలు విపరీతంగా గీసేవాడ్ని. ఇక నాలో ఆలోచనలకు రెక్కలొచ్చినపుడల్లా అంజలి అందమైన బొమ్మ రంగులద్దుకుంది. అలా గీసిన ప్రతి బొమ్మ పడేయడానికి మనసురాక ఒక పాత పెట్టెలో దాచాను. అందులో తన కోసం కొన్న మువ్వల పట్టీలు, కాటుక డబ్బాలు, పరికిణీలు, చీరలు, ఉంగరాలు, లోలకులు, గాజులు... అన్నీ ఉంటాయందులో! తొలిసారి ముద్దు పెట్టుకున్నందుకు చేతుల మీద వాతలు పెట్టుకున్న దబ్బనంతో సహా అన్నీ ఉంటాయ్.

నమ్మలేనట్లు అమృతను చూస్తూ ''నువ్వెపుడు చూశావ్?'' అడిగా.

''మీ అమ్మ ఫొటో చూపించమని అమ్మనడిగా... అప్పుడు...'' నేను తల పట్టుకునే సరికి చెప్పడం ఆపేసింది.

మెదడు పనిచేయడం లేదు. అట్నుంచటే బయటికి నడిచా.

నిద్రపోయే సమయానికి ఇల్లు చేరుకున్నాను.

అమృతను ఒళ్లో పడుకోబెట్టుకుని గుమ్మం దగ్గరే కూచొనుంది.

ఇక దాయడం దండగనిపించింది. తానడగక ముందే చెప్పడం బాగుంటుందని నోరు విప్పాను.

''నువ్వంటే నాకు ప్రేమ లేదు. నీ మీద ఏ భావనా లేదు. అవన్నీ అప్పుడెప్పుడో గీసినవి. వాటినిప్పుడే తగలేస్తాను. నన్ను అపార్థం చేసుకోకు. నేను కుంచె పట్టక చాలా ఏళ్లయింది. నాది తప్పే! ఇక జీవితంలో బొమ్మలేయను'' అన్నాను.

తన నుండి ఎలాంటి స్పందనా లేదు.

''నేను శిలనై చాన్నాళ్లయింది. నన్ను చివరిసారిగా క్షమించు. నా మీద కోపంతో నన్ను వదిలేసి వెళ్లొద్దు. అమృత లేకుండా నేనుండలేను'' గద్గద స్వరం... దానికి తోడు తడిసిపోయిన కళ్లు. గోడకు చారగిలబడి పైకి చూస్తున్నాను కన్నీళ్లను కళ్లలో నిలిపి ఉంచాలనే ఉద్దేశ్యంతో.

ఒక్కసారిగా అదిరిపడ్డాను.

''బావా!'' అంటూ అంజలి నా కాళ్లను చుట్టేసింది.

కట్టలు తెంచుకున్న దుఃఖం మాటలకడ్డు పడుతూ ఆమెను తుపాను సంద్రం చేస్తోంది. ఆ తుపాను గాలికి ఊగిసలాడే వృక్షంలా నా పరిస్థితి.

కాస్సేపటికి విడిపించుకున్నాను.

''నిన్ను తాకితే నేను చనిపోయినట్లే..అని చెప్పి నీకాశ్రయమిచ్చాను. ఆ పని ఎవరు చేసినా ఒకటే! నీపై ప్రేమ నాలో ఏనాడో గడ్డకట్టిపోయింది. నేను అవకాశవాదిని కాను. బ్రతకడం కోసమే బ్రతికే మనిషిని మరో విధంగా శిలను నేను''

కన్నీళ్లు తుడుచుకుని దూరంగా జరిగింది.

''అమ్మా! మనం వెళ్లిపోదాం రా!'' అంది అమృత సడెన్‌గా.

నాకు నోట మాట రావడం లేదు.

''నిన్ను నాన్న అనకూడదు. అమ్మ నీతో మాట్లాడకూడదు. మరైతే ఇక్కడెందుకు మా తాతయ్య దగ్గరికి వెళ్లిపోతాం - అమ్మా నేను.'' అమాయకంగా తలూపుతూ అంటోంది అమృత.

గుండాగినంతగా తల్లడిల్లాను ఆ మాటలకు. వెంటనే అమృతను దగ్గరికి తీసుకుని ముద్దాడాను.

''మనిద్దరం చనిపోయి చాలా రోజులయింది. అమృత వల్లే మరుజన్మ ప్రాప్తించింది. ఈ జన్మ గతానికి అతీతమైనది. కేవలం భవిష్యత్ మాత్రమే కలిగినది. నేనిపుడే అమృతకు 'నాన్న'గా పుట్టాను. ఆ 'పాత్ర'కు మించి పోషించలేను'' హఠాత్తుగా నా నోరు మూసింది అంజలి తన చేతులతో.

''ప్రేమ నిప్పులాంటిది. దాంట్లో దహనమై మనం ఏనాడో పవిత్రులమయ్యాం. నా మీద నీ ప్రేమ అజరామరమైంది. నీ నిష్కల్మషమైన ఆరాధనలో నేనేనాడో నీదాన్నయ్యాను. ఇది రాజీకి రావడం కాదు. అపార్థం నుండి అర్థంలోకి రావడం... నువ్వు చేసిన త్యాగాల ముందు ఇంకా నన్ను చంపకు బావా! నాకు దూరంగా వెళ్లకు బావా ప్లీజ్!'' అంటూ ఏడుస్తోంది అంజలి.

మెల్లగా దగ్గరికెళ్లాను. ముఖమ్మీది కన్నీళ్లు తుడిచి గట్టిగా కౌగిలించుకున్నాను. రెండు ముక్కలుగా వేరుచేయబడ్డ హృదయమొకటి ఇప్పుడు కలిసిపోయింది. నా అమృత చప్పట్లు కొడుతూ గెంతులేస్తోంది.

## కోరిక

**సంచలన దర్శకుడు రాంగోపాల్‌వర్మ నిర్మించే చిత్రంలో నటించాలని ప్రతి నటుడూ కోరుకుంటాడు. అలాంటిది బిగ్‌బి తనయుడు అభిషేక్ కోరుకోవడంలో ఆశ్చర్యం ఏముంది? ఇప్పుడు అభిషేక్ రాముతో కలిసి సినిమా చేయాలని ఉందంటున్నాడు. 'రాంగోపాల్‌వర్మ నిర్మించే చిత్రంలో ఎలాంటి పాత్ర చేయడానికైనా నేను రెడీగా ఉన్నాను. ఆ పాత్ర ఎప్పుడు వచ్చినా నేను చేస్తాను' అంటున్నాడు ఎంతో ఉత్సాహంగా. అతని కల నిజమవ్వాలని మనమూ ఆకాంక్షిద్దాం.**

